ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





డీఎస్సీ ఒక డ్రామా

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 2:

గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో తాను అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీతోపాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు అవుతున్నా మెగా డీఎస్సీ లేదు, జాబ్ క్యాలెండరూ లేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తారని నిరుద్యోగులు ఆశతో ఇన్నేళ్లు నెట్టుకొచ్చారు. మళ్లీ ఎన్నికలు వచ్చాయిగాని తమకు ఉద్యోగాలు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వైఎస్ జగన్ తాను ఇచ్చిన హామీని అమలు చేయాలనే చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, తిరిగి అధికారంలోకి రావడానికి ఎన్నికలు సమీపిస్తున్న వల్ల అరకొర ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. రెండ్రోజుల క్రితం జరిగిన మంత్రిమండలి సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇంత పరిమిత సంఖ్యలో పోస్టులు భర్తీ చేయడమంటే దగా చేయడమేనని నిరుద్యోగులు మండిపడుతున్నారు. నిరుద్యోగుల్లో తీవ్రమవుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం మభ్యపెడుతోందని వారు విమర్శిస్తున్నారు. 117జీవో ముసుగులో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం కుదించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్జీటీ పోస్టులు భారీ ఎత్తున కోల్పోవాల్సి వచ్చింది. పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ ప్రక్రియతో పోస్టులు కోతకు గురి కావాల్సివచ్చింది. పదోన్నతులు చేపట్టడంతో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగాఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత కలిగిన ఎస్జీటీలతో భర్తీ చేయడంతో ఆ పోస్టులు కూడా పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ, పురపాలక, సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. గతంలో వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసి భర్తీ చేసేవారు. అట్లా కాకుండా ఒకే ప్రకటనతో ఖాళీలు భర్తీ చేస్తే అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు మొత్తం కలుపుకున్నా 1750 పోస్టులకన్నా ఎక్కువ లేవు.



- రాష్ట్ర వ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే ప్రకటన
- ఎన్నికల వేళ ప్రభుత్వం హడావుడి
- మెగా డీఎస్సీకి మంగళం
- ప్రభుత్వ నిర్వాకంపై నిరుద్యోగుల ఆగ్రహం

కొరవడిన స్పష్టత

డీఎస్సీ ప్రకటనకు ముందుగానే ఖాళీల వివరాలు ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. నిర్దిష్టమైన తేదీలోపు ఎన్ని ఖాళీలు ఉన్నదీ ప్రభుత్వం సమగ్ర వివరాలు కోరలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జనవరి 31వ తేదీలోపు ఉద్యోగ విరమణ చేసినవారు, మృతుల వివరాలు సేకరించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఎప్పటి నుంచో ఇప్పటి వరకు ఖాళీలు గుర్తించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.



అప్రెంటిస్‌షిప్ విధానం

కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు అప్రెంటిస్ షిప్‌విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ విధానం ఉండేది. ఉద్యోగంలో చేరిన మొదటి సంవత్సరం రూ.1200, రెండో సంవత్సరంలో రూ.1500 వేతనం ఇచ్చేవారు. మూడో సంవత్సరంలో అప్రెంటిస్ షిప్ ముగుస్తుండటంతో మినిమం టైం స్కేల్‌తో పూర్తి వేతనాన్ని ఇవ్వనున్నారు. ఈ పద్ధతి గతంలో అమలుకావడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవడంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2010లో అప్పటి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది. అయితే ఇదే విధానాన్ని మళ్లీ వైసీపీ ప్రభుత్వం కొనసాగించాలని నిర్ణయించడంతో నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి.

నిరాశ కలిగించింది



అయిదేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాం. ఎంతో కష్టపడి చదువుతున్నాం. ఇన్నేళ్ల తర్వాత వస్తున్న డీఎస్సీలో తక్కువ పోస్టులను ప్రభుత్వం ఇవ్వడం చాలా నిరాశకు గురిచేసింది. నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది.

- లక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, శిరివెళ్ల మండలం

ఇప్పుడు గుర్తొచ్చామా?



నాలుగున్నరేళ్ల తర్వాత ప్రభుత్వానికి నిరుద్యోగులు గుర్తుకు వచ్చారు. ఈ నాలుగేళ్లలో మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఎక్కడకు వెళ్లిందో తెలియదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అరకొర పోస్టులు చూపి డీఎస్సీని విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకోవడం హాస్యాస్పదం.

- విజయానంద్, డీఎస్సీ అభ్యర్థి, నంద్యాల

అప్రెంటిస్‌షిప్‌ను రద్దు చేయాలి



ప్రభుత్వం మళ్లీ ఉపాధ్యాయ నియామకాల అనంతరం అప్రెంటిస్‌షిప్ విధానాన్ని కొనసాగించడం సరి కాదు. ఈ విధానంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతారు. గతంలో పోరాటాలు చేసి ఆ విధానాన్ని రద్దు చేయించుకుంటే వైసీపీ ప్రభుత్వం మళ్లీ దాన్ని తెరమీదకు తీసుకరావడం దారుణం.

- కె.వి.శివయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీటీఎఫ్, నంద్యాల

కష్టపడి గెలిపిస్తే పక్కకు వెళ్లారు

- నేననుకుంటే ఆ నియోజకవర్గాల్లో వైసీపీకి డిపాజిట్లు రాకుండా చేస్తా
- సానుభూతి కోసమే తెరపైకి ప్రొటోకాల్ సమస్య
- సొంత పార్టీ ఎమ్మెల్యేలపై శాప్ చైర్మన్ బైరెడ్డి విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు ఫిబ్రవరి 2: ప్రజలను ఓట్లు అడిగి ఎన్నికల్లో గెలిపిస్తే అవకాశవాదులు నేడు పార్టీకి దూరమైపోయారని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. నందికొట్కూరు వైసీపీ నియోజక వర్గ సమన్వయకర్త దార సుధీర్‌ను ముఖ్య నాయకులు, కార్యకర్తల పరిచయం చేసే కార్యక్రమాన్ని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నందికొట్కూరు మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా అధికార పార్టీలో ఉన్నామా..? ప్రతిపక్ష పార్టీలో ఉన్నామా అనేది అర్థం కాని పరిస్థితిలో నెట్టుకొచ్చామన్నారు. ప్రజలను ఓట్లు అడిగింది, ఎమ్మెల్యేను గెలిపించింది తామేనని, అయితే ఎమ్మెల్యే పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే వద్ద చేతులు కట్టుకుని నిలబడితే తాము ఎందుకు భరించాలని ఆర్థర్‌ను ఉద్దేశించి అన్నాడు. పక్క నియోజకవర్గాల నాయకులు వచ్చి ఇక్కడ టీడీపీ వారిని వైసీపీలో చేర్చితే తాము ఎట్లా సహిస్తామని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. తాను కూడా పక్క నియోజకవర్గంలోకి వేలు పెట్టి డిపాజిట్లు కూడా రాకుండా అడ్డుకోగలనని అన్నారు. ఎవరితోనూ వ్యక్తిగత శత్రుత్వం లేకపోయినా పార్టీ నిర్వాకం వల్ల అధికారంలోకి వచ్చాక కేసులు భరించాల్సి వచ్చిందని అన్నారు.

సీటు తెచ్చుకునేందుకే ప్రొటోకాల్ సమస్య

నియోకవర్గం ప్రజా సమస్యలపై తాను పార్టీ అధిష్ఠానం వద్ద పోరాడుతుంటే నందికొట్కూరులో కొందరు ప్రొటోకాల్ కోసం కొట్లాడుతున్నారని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. తనను దళిత ద్రోహి అని కొందరు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే వర్గాన్ని ఉద్దేశించి ఆయన తీవ్ర స్వరంతో మాట్లాడారు. సానుభూతి, జాలి సంపాదించి మరోసారి ఎమ్మెల్యే టిక్కెట్ తెచ్చుకునేందుకే ఆర్థర్ ప్రొటోకాల్ సమస్యను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ వ్యవహారం అధిష్ఠానం గమనించి ఈసారి దారా సుధీర్‌కు అవకాశం ఇచ్చిందని అన్నారు. దొంగనోట్లు చెలామణి చేసినవాళ్లు, రైతుల డబ్బులు తిన్నవారు తమ వల్ల గెలిచి అధికారాన్ని వినియోగించుకున్నారని ఎమ్మెల్యే వర్గంపై ఆయన విరుచుకపడ్డారు. ఈసారైనా ఈ అంతర్గత శత్రువును తొక్కి కార్యకర్తలను కాపాడేందుకు అవకాశం ఇవ్వాలని జగన్‌ను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు.

కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడుతా: నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మగౌరవానికి తన వల్ల భంగం కలిగిన రోజు తాను తప్పుకుంటానని దారా సుధీర్ అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, అన్ని మండలాల జడ్పీటీసీలు, ఎంపీడీసీలు, ఎంపీటీసీలు, వైసీపీ మద్దతు దారులైన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డీఆర్వోగా పద్మజ



డీఆర్వోగా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 2: నంద్యాల జిల్లా రెరెన్యూ అధికారిగా పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల డీఆర్వో చాంబర్‌లో ఈ మేరకు ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. గత డీఆర్వో పుల్లయ్య చిత్తూరు జిల్లా డీఆర్వోగా బదిలీ కావడంతో ప్రభుత్వం ఆమెను కొత్త డీఆర్వోగా నియమించింది. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేస్తామని పద్మజ తెలిపారు.

ఆడుదాం.. ఆంధ్రాలో ఘర్షణ



నంద్యాలలో క్రికెట్ ఫైనల్ పోటీలో గొడవ పడుతున్న దృశ్యం

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 2: సీఎం జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు తన్నుకుందాం ఆంధ్రాగా మారాయి. వారం రోజుల క్రితం నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీల్లో ఇరుజట్ల క్రీడా కారులు కుర్చీలు, పిడిగుద్దులతో తన్నుకున్న ఘటన మరువకముందే శుక్రవారం నంద్యాలలో జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలో ఇరుజట్ల మద్దతుదారులు బాహాబాహీకి దిగి గొడవకు పాల్పడ్డారు. ఎస్పీజీ క్రీడా మైదానంలో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నందికొట్కూరు నియోజకవర్గ జట్టు, నంద్యాల నియోజక వర్గ జట్టు మధ్య పోటీ జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న నంద్యాల జట్టు 4 ఓవర్లలో 22 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉంది. ఈ సమయంలో బ్యాట్స్‌మెన్ బంతిని ఆడి మూడు పరుగులు సాధించారు. బౌండరీ లైన్ వద్ద బంతిని పరిశీలించేందుకు వెళ్లిన అంపైర్ దాన్ని ఫోర్‌గా ప్రకటించారు. దీంతో నందికొట్కూరు జట్టుకు చెందిన మద్దతుదారులు అది ఫోర్ కాదంటూ క్రీడా మైదానంలోకి చొరబడుతూ అంపైర్‌తో వాదిస్తుండటంతో నంద్యాల జట్టు మద్దతుదారులు అడ్డుకున్నారు. దీంతో ఇరుజట్ల మద్దతుదారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి సర్ది చెప్పారు. ఈ ఘటనతో మ్యాచ్‌కు అరగంట అంతరాయం ఏర్పడింది. ఘటన నుంచి తేరుకొని పోటీని కొనసాగించారు. ఓటమి అంచుల నుంచి బయటపడుతూ నంద్యాల జట్టు ఒత్తిడిని అధిగమించి పరుగులు సాధిస్తూ వచ్చింది. చివరి బంతి వరకు ఎంతో ఉత్కంఠగా పోటీ కొనసాగింది. ఒక బాలు మిగిలి ఉండగానే నంద్యాల జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.



ప్రభుత్వ ఆదేశాలను అమలు పరుస్తాం

కలెక్టర్ కె. శ్రీనివాసులు



బాధ్యతల స్వీకరిస్తున్న డా. కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 2: ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పక పాటించి అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సుపరిపాలన అందించడమే లక్ష్యమని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌గా డా. కె. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం ప్రథమ నందీశ్వరాలయ అర్చకులతో వేదమంత్రాలతో ఆశీర్వాదం అందుకున్నారు. నూతన జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులుకు ఎస్పీ రఘువీర్ రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్య, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. వివిధ శాఖల సిబ్బంది తదితరులు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 2: ఇటీవల నంద్యాల కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన కె.శ్రీనివాసులును ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ శ్రీనివాసులును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగన్ అంటేనే మండుతోంది

- వీడియో ద్వారా ఆగ్రహం వెళ్లగక్కిన కానిస్టేబుల్
- సామాజిక మాధ్యమాల్లో వైరల్



మోహన్ కుమార్

ఆత్మకూరు, ఫిబ్రవరి 2: డీఏలు, టీఏలు, ఎస్ఎల్ఎస్‌లు ఇవ్వనందుకు సీఎం జగన్‌పై తనకు మండుతోందని ఓ కానిస్టేబుల్ ఆగ్రహం వెళ్లగక్కిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2013 బ్యాచ్‌కు చెందిన మోహన్ కుమార్ అనే కానిస్టేబుల్ ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నాడు. తమకు డీఏలు, టీఏలు, ఎస్ఎల్ఎస్‌లు ఇవ్వనందుకు జగన్ మీద మండిపడ్డాడు. సినీనటుడు బాలకృష్ణ నటించిన సింహా సినిమాలోని డైలాగ్ చెప్పారు. ఓ రోగి బాడీలోకి వైరస్ ప్రవేశిస్తే డాక్టర్‌గా ఎలా చంపేస్తామో.. సమాజంలోకి వచ్చే వైరస్‌ను కూడా ఓ పౌరుడిగా అలాగే చంపేస్తానంటూ చెప్పిన డైలాగ్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే కొంతకాలంగా సదరు కానిస్టేబుల్ మానసిక స్థితి సరిగా ఉండటం లేదని, ఇలాగే సినిమా డైలాగులు చెబుతున్నాడని తెలిసింది.

మానసిక స్థితి సరిగా లేనందుకే ఇలా..

ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ మోహన్‌కుమార్ మానసిక స్థితి సరిగా లేదని ఆయన తండ్రి రాజశేఖర్ శుక్రవారం వివరించారు. 2013 బ్యాచ్‌లో ఎంపికైన తన కుమారుడు రెండేళ్లుగా ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే పదేళ్ల నుంచి తన కుమారుడి మానసిక స్థితి సరిగా లేదని, హైదరాబాద్, విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలల్లో చికిత్స చేయించినట్లు చెప్పారు. 2015లో చేతిలోని తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారని, దీంతో తన కుమారుడిని సస్పెండ్ చేశారని అన్నారు. 2022లో ఆరోగ్యం కుదుటపడ్డాక పోస్టింగ్ ఇచ్చారని వివరించారు.

గంగులా.. నీ పరువు నువ్వే తీసుకున్నావ్

- ఆంధ్రజ్యోతి కథనంలో ఎక్కడా నీ పేరు రాయలేదే
- నియోజకవర్గంలో జరిగే అరాచకాలపై ఎందుకు ప్రెస్ మీట్ పెట్టవు?
- ల్యాండ్ సెటిల్మెంట్లు, ఇసుక, మద్యం, బియ్యం మాఫియా, పేకాట స్థావరాలు నీవి కావా?
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యేపై భూమా అఖిలప్రియ ఫైర్



నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 2: రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి ప్రధాన పేజీలో ఫ్యాక్షన్ గడ్డపై ఫ్యామిలీ ప్యాకేజ్ కథనంపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డేనని తనకుతానే ఊహించుకొని ప్రెస్‌మీట్ పెట్టి తన పరువు తానే తీసుకున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో ఎక్కడా ఆళ్లగడ్డ నియోజకవర్గం పేరుగానీ.. ఎమ్మెల్యే పేరు కానీ లేకపోయినా హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి పత్రికపై, రిపోర్టర్‌పై పరుష పదజాలాన్ని వాడడం వైసీపీ అరాచకానికి నిదర్శనమని అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అరాచకాలు, అఘాయిత్యాలపై ఏనాడూ ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టలేదని నిలదీశారు. ల్యాండ్ సెటిల్మెంట్లు, ఇసుక వ్యాపారం, నాసిరకం మద్యం తయారీ, బియ్యం మాఫియా, పేకాట నిర్వహణ నీవి కావా అంటూ ఆమె మండిపడ్డారు. వాస్తవాల కథనంపై పరువు నష్టం దావాకు వెళ్తే కోర్టులో మొట్టికాయలు తప్పవని హెచ్చరించారు. ఆళ్లగడ్డలో బాలికపై అత్యాచారం విషయంలో ఎందుకు నోరు మెదపలేదని ఆమె ప్రశ్నించారు. సహాయం కోసం వచ్చిన వారినే బెదిరించి వారి భూములనే లాక్కోవడం ప్రజలకు తెలియదా అని మండిపడ్డారు. అంగన్‌వాడీ పోస్టులను అమ్ముకున్నారని, తాను మంత్రిగా ఉన్నప్పుడు ఏడు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయిస్తే అందులోని ఆపరేటర్ పోస్టుకు రూ.10 లక్షలు, అటెండర్ పోస్టుకు రూ.6లక్షలు వెలకట్టారని ఆరోపించారు. మున్సిపల్ కౌన్సిలర్ బియ్యం వ్యాపారం చేస్తుండగా తన తమ్ముడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టించారని ఆమె గుర్తు చేశారు. నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలతో పేకాట స్థావరాలను ఏర్పాటు చేయించి కమీషన్లు తీసుకుంటున్నారని, సరైన సమయానికి కమీషన్లు రాకపోతే పోలీసులకు పట్టించిన ఘనత కాదా అంటూ ఎద్దేవా చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలు, దందాలపై అన్ని ఆధారాలతో ఈ నెల 15న చర్చకు సిద్ధమా అని ఆమె సవాల్ విసిరారు.

ఎంపీడీఓలకు నియామక ఉత్తర్వులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇతర జిల్లాల నుంచి కర్నూలు ఉమ్మడి జిల్లాకు వచ్చిన 38 ఎంపీడీఓలకు మండలాలను కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి అనంతపురం, వైఎస్ఆర్ కడపకు జిల్లాకు బదిలీపై ఎంపీడీవోలు వెళ్లారు. వారి స్థానంలో వచ్చిన ఎంపీడీఓలకు స్థానాలు కేటాయించారు. తక్షణమే ఈ ఎంపీడీవోలు విధుల్లోకి వెళ్లాలని సీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంపీడీఓ పేరు	పని చేసిన మండలం	జిల్లా	ఉమ్మడి జిల్లాలో కేటాయించిన మండలం
ఎ.వి. శ్రీనివాసులు	విడనపకల్లు	అనంతపురం	డోన్
టి. లక్ష్మీనారాయణ	యాడికి	అనంతపురం	ఆస్పరి
బివి. రవిప్రసాద్	అగలి	అనంతపురం	బేతంచెర్ల
జి. మునెప్ప	అమడగూరు	అనంతపురం	మంత్రాలయం
ఎస్. సాయి మనోహర్	బత్తలపల్లి	అనంతపురం	ప్యాపిలి
ఎస్. గంగావతి	సీకే.పల్లి	అనంతపురం	మిడ్తూరు
కేఎన్. సరేష్‌క్రిష్ణ	చిల్లమాతూర్	అనంతపురం	నందికొట్కూరు
డి. రామారావు	గుడిబండ	అనంతపురం	పత్తికొండ
పి. నరేంద్రకుమార్	హిందూపుర్	అనంతపురం	ఆలూరు
టి. అలివేలమ్మ	కంగనాపల్లి	అనంతపురం	మద్దికెర
ఎస్. బారెన్‌సాహెబ్	కొత్తచెరువు	అనంతపురం	చిప్పగిరి
ఎం. నరసింహనాయుడు	లేపాక్షి	అనంతపురం	కర్నూలు
సీఎల్. సోనిబాయి	మడకశిర	అనంతపురం	గోనెగండ్ల
కేవి. కవిరాజు	ముదిగుబ్బ	అనంతపురం	పగిడ్యాల
బి. శకుంతల	నల్లచెరువు	అనంతపురం	సి.బెళగల్
ఎం. కొండన్న	నల్లమాడ	అనంతపురం	ఎమ్మిగనూరు
వి. సరస్వతి	పరిగి	అనంతపురం	పాములపాడు
ఎస్. శివశంకరప్ప	పెనుకొండ	అనంతపురం	వెల్దుర్తి
డి. రాబర్ట్ విల్సన్	రొద్దం	అనంతపురం	క్రిష్ణగిరి
కే. అజాద్	రోళ్ళ	అనంతపురం	హోళగుంద
బి. విజయలక్ష్మి	తాడిమర్రి	అనంతపురం	తుగ్గలి
బి. కిరణ్‌మోహన్‌రావు	తలుపుల	అనంతపురం	నందవరం
ఎస్. రఘునాథగుప్త	గోరంట్ల	అనంతపురం	కౌతాళం
జి. సౌభాగ్యం	నందలూరు	వైఎస్ఆర్ కడప	నంద్యాల
ఎవి. రమణరెడ్డి	మైదుకూరు	వైఎస్ఆర్ కడప	ఆళ్లగడ్డ
ఎస్. భాగ్యలక్ష్మి	ఎర్రగుంట్ల	వైఎస్ఆర్ కడప	పాణ్యం
సీఏ. జవహర్‌బాబు	----	వైఎస్ఆర్ కడప	కొత్తపల్లి
పి. జయశ్రీ	వళ్లూరు	వైఎస్ఆర్ కడప	గూడూరు
ఏ. మల్‌రెడ్డి	రాయచోటి	వైఎస్ఆర్ కడప	అవుకు
ఎస్. విజయరావు	ఓబులవారిపల్లె	వైఎస్ఆర్ కడప	బండిఆత్మకూరు
ఎం. దివ్య	చిన్నమండెం	వైఎస్ఆర్ కడప	కోడుమూరు
ఎస్. రామచంద్ర	టి.సూదపల్లె	వైఎస్ఆర్ కడప	రుద్రవరం
డి. మల్లేశ్వరి	వీరబల్లి	వైఎస్ఆర్ కడప	ఓర్వకల్లు
ఎస్. శ్రీనివాసరెడ్డి	లవ్‌లేదు	వైఎస్ఆర్ కడప	ఆత్మకూరు
ఎస్. శివరామిరెడ్డి	చిట్వేల్	వైఎస్ఆర్ కడప	గడివేముల
జీవి. రఘురామ్	వళ్లూరు	వైఎస్ఆర్ కడప	ఉయ్యాలవాడ
ఎస్. ఫణిరాజ్‌కుమారి	రాజంపేట	వైఎస్ఆర్ కడప	శిరివెళ్ల
ఎస్.సూర్యనారాయణ రెడ్డి	ముద్దనూరు	వైఎస్ఆర్ కడప	చాగలమర్రి

8 మంది సీఐలకు స్థానాల కేటాయింపు

కర్నూలు, ఫిబ్రవరి 2: ఇటీవల పదోన్నతి పొందిన 8 మంది సీఐలకు స్థానాలు కేటాయిస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.శ్రీధర్	వీఆర్ కర్నూలు రేంజ్	కర్నూలు తాలుకా
ఏ.రామకృష్ణయ్య	వీఆర్, కర్నూలు రేంజ్	గోనెగండ్ల
ఏ.వేణుగోపాల్	వీఆర్ కర్నూలు రేంజ్	సైబర్ క్రైమ్
ఏ.జయన్న	వీఆర్ కర్నూలు రేంజ్	ఫ్యాక్షన్ జోన్ కర్నూలు
ఎస్.వెంకటరమణ	వీఆర్, కర్నూలు	సీసీఎస్ కర్నూలు
ఎం.రామయ్య నాయుడు	పీసీఆర్ ఆదోని	కర్నూలు త్రీటౌన్
ఎల్.విజయలక్ష్మి	వీఆర్ కర్నూలు రేంజ్	పీసీఆర్ ఆదోని
డి.హాజీవలి	వీఆర్, కర్నూలు	దిశా పీఎస్ కర్నూలు

ఐదుగురు సీఐలకు రెగ్యులర్:

జిల్లాలో ఐదుగురు సీఐలకు ప్రస్తుతం ఉన్న అటాచ్‌మెంట్లను రెగ్యులర్ చేస్తూ ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు. పవన్ కుమార్ (కర్నూలు వన్‌టౌన్), సోమశేఖర్ రెడ్డి (కర్నూలు వన్‌టౌన్- అడిషనల్ పోస్టు), ప్రవీణ్ కుమార్ రెడ్డి (పత్తికొండ రూరల్ సర్కిల్), సురేష్ కుమార్ రెడ్డి (వెల్దుర్తి సర్కిల్), గౌతమి (కర్నూలు ట్రాఫిక్).

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల దరఖాస్తులు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మధుసూదన్ రావు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం 368 మంది జర్నలిస్టులు దరఖాస్తులు చేసుకున్నారని డీఆర్‌ఓ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో జర్నలిస్టులు ఇళ్ళ స్థలాల కోసం చేసుకున్న దరఖాస్తుల వెరిఫికేషన్‌పై అయన తహసీల్దార్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ జీఓ 535 ప్రకారం జర్నలిస్టుల నుంచి ఇళ్ల స్థలాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన వెరిఫై చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ హరిప్రసాద్, సమాచార శాఖ ఉపసంచాలకులు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని ఆయన తెలిపారు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 నుండి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుండి 1 గంట వరకు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2.30 గంటల నుండి 3.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, 3.30 గంటల నుండి 4.30గంటల వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

డోలమైట్ ట్రాక్టర్ సీజ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 2: డోన్ పరిధిలోని హెచ్. కోట్టాల, పెద్దమల్కాపురం ప్రాంతాల్లో డోలమైట్ తరలిస్తున్న ఒక డోలమైట్, మరొక రాతిచిప్స్ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం డోన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా రాయల్టీ లేకుండా ఈ రెండు ట్రాక్టర్లలో డోలమైట్, రాతి చిప్స్ తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ ఇతర ఇతర సిబ్బంది పాల్గొన్నారని పెర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపట్టండి



కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల జాబితా అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా ప్రచురణ అయ్యాక అందులోంచి ఓటర్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జి. సృజన , మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేశారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు
- కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత నిరసన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత పార్లమెంట్ ఆధ్యక్షుడు అబ్బాస్ అధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని చేపలు, మాంసం విక్రయించి వినూత్నంగా నిరసన తెలిపారు. మాట్లాడుతూ అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు వలంటీర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టారని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేస్తామని 2019 ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ యువత నిట్టనిలువునా ముంచారని మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా 6100 పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి వర్గంలో వెల్లడించడం కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించే నిమిత్తం స్కీల్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యావంతులకు సాంకేతిక శిక్షణను ఇప్పించారని అన్నారు.



కలెక్టరేట్ ఎదుట చేపలు అమ్ముతూ నిరసన

యువతను మోసగించిన జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పీజీ గోపినాథ్, సోమిశెట్టి నవీన్, జూటూరు రవి, సందీప్, రాజు, టీఎన్ఎస్ఎఫ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న ఎస్వీ విజయ మనోహరి

మద్దికెర, ఫిబ్రవరి 2: కర్నూలు జిల్లాలో మొత్తం 99 సహకార సంఘాలు ఉన్నాయని, ప్రతి సంఘాన్ని బలోపేతం చేస్తామని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, పత్తికొండ ఎమ్మెల్యే కె. శ్రీదేవి అన్నారు. శుక్రవారం మద్దికెర సహకార సంఘంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపులను ప్రారంభించారు. అనంతరం మద్దికెర సహకార సంఘం ఛైర్మన్ వై.శాంతన్న అధ్యక్షతన జరిగిన సహకార సంఘం సభలో వారు మాట్లాడుతూ మద్దికెర సహకార సంఘం దాదాపు 20 కోట్ల లావాదేవీలతో నడుస్తున్నదని అన్నారు. ఈ సహకారసంఘం జిల్లాకే ఆదర్శంగా నిలిచిందన్నారు. జనరిక్ మెడిసిన్ వాడడం వల్ల ప్రజలకకు ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ శాంతన్న, జడ్పీటీసీ సభ్యులు డి. మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ ఎంపీపీ మల్లికార్జునయాదవ్, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, సీఈవోలు రామాంజనేయులు, ఎర్రిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మద్దికెర గ్రామంలోని సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, సీసీ రహదారుల పనులను ఎమ్మెల్యే కె.శ్రీదేవి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.65 లక్షలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణం, వ్యవసాయ శాఖ అధికారి రవి తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరితరెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 2: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో రాష్ట్ర టీడీపీ పిలుపు మేరకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఘనంగా ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమెతో పాటు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మొదటి విడతలో మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, సుధాకర్‌రావు, శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, మధుసూదన్ గౌడు, విజయరాఘవరెడ్డి, అయ్యస్వామి, శ్యాం సుందర్‌రెడ్డి, రఫీ, బాషా, రమణయ్య, మద్దిలేటి రామాంజనేయులు, ఖాదర్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, సంజీవ, నాగమల్లేష్, గుట్టపాడు చిన్న, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

- వైసీపీ నుంచి 40 మంది టీడీపీలో చేరిక మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలోని వైసీపీ నాయకుడు భైరాపురం సుధాకర్ రెడ్డితో పాటు 40 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది టీడీపీలో చేరారు.

ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జిగా బుట్టా రేణుక

- రుద్రగౌడ్‌కు మొండి చెయ్యి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 2: వైసీపీ అభ్యర్థుల ఆరో జాబితాను పార్టీ అధి నాయకత్వం శుక్రవారం విడుదల చేసింది. ఇందులో ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించింది. వయోభారం కారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి అధిష్టానం టికెట్ నిరాకరించింది. ఆశావాహులు ఎక్కువగా ఉండటంతో పార్టీ బీసీ నినాదాన్ని అందుకుంది. ఎమ్మెల్యే అభీష్టం మేరకే అభ్యర్థిని నిర్ణయించడానికి ఒప్పుకుంది. పట్టణానికి చెందిన మాచాని వెంకటేష్‌ను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించటంతో ఆయననే నియమించింది. అయితే సర్వేలు మాచాని వెంకటేష్‌కు వ్యతిరేకంగా రావటంతో ఎమ్మెల్యేతో పలు దఫాలుగా చర్చించి తప్పని పరిస్థితుల్లో ఒప్పించింది. ఇందులో భాగంగానే మాజీ ఎంపీ బుట్టా రేణుకను గత వారం రోజుల క్రితం టికెట్ ఖరారు చేసింది. ఐదో జాబితాలోనే ఆమె పేరు ప్రకటిస్తారని భావించినప్పటికీ అప్పటికి వెలువడలేదు. ఎట్టకేలకు ఆరో జాబితాలో బుట్టా రేణుక పేరును ప్రకటించింది. అయితే స్థానిక చేనేత సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టికెట్‌ను ఆశించారు. అధిష్టానం వారిని పక్కన బెట్టి నాన్‌లోకల్ అయిన బుట్టా రేణుకను ఎంపిక చేయటంపై స్థానిక చేనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మాచాని వెంకటేష్‌ను అనుచరులకు పరిచయం చేస్తూ బుట్టా రేణుక నాన్ లోకల్ అన్న ఎమ్మెల్యే ఇప్పుడు ఎందుకు ఒప్పుకున్నారని చేనేత సామాజికవర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు.



బుట్టా రేణుక



రుద్రగౌడ్

- **బుట్టాకు వ్యతిరేకంగా బంధువర్గం** బుట్టా రేణుకకు మాచాని కుటుంబంతో బంధుత్వం ఉంది. మాచాని రఘునాథ్ కుమారుడు డా.సోంనాథ్ స్వయాన బుట్ట రేణుక అల్లుడు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే వైసీపీ అధిష్టానం బుట్టకు టికెట్ కేటాయించింది. అయితే బుట్టకు వ్యతిరేకంగా అల్లుడు సోంనాథ్ టీడీపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. సీటు రానిపక్షంలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని ప్రకటించాడు. బుట్టా రేణుకను బంధువులే వ్యతిరేకించటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.
- **రుద్రగౌడ్‌కు మొండి చెయ్యి:** వైసీపీ అధిష్టానం ఎమ్మిగనూరు సీటు బీసీలకు కేటాయించటంతో తనకు టికెట్ కేటాయించాలంటూ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్ తీవ్రంగా ప్రయత్నించాడు. ఎమ్మెల్యే ఒప్పుకుంటే సీటు కేటాయిస్తామంటూ అధిష్టానం ఫిటింగ్ పెట్టింది. అయితే ఎమ్మెల్యే వ్యతిరేకించటంతో రుద్రగౌడ్‌కు సీటు దక్కకుండా పోయింది. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించటం చర్చనీయాంశమైంది.

వేరుశనగ పాసింగ్ విధానానికి స్వస్తి పలకాలి

- కుదరదంటున్న వ్యాపారులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 2: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడికి పాసింగ్ విధానానికి స్వస్తి పలకకపోతే గుర్తింపు రద్దు చేస్తామని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో వేరుశనగ వ్యాపారులు కమిషన్ ఏజెంట్, రైతు సంఘ నాయకులతో వేరుశనగ పాసింగ్‌పై చర్చలు జరిగాయి. ఎంతో కష్టపడి వ్యయప్రయాసలతో పండించిన దిగుబడిని విక్రయానికి చేస్తే నాణ్యత పేరుతో పాసింగ్ అంటూ వారిని ఇబ్బంది పెట్టడం మంచిది కాదని కార్యదర్శి వారిని హెచ్చరించారు. వ్యాపారులు తాము 50 ఏళ్లుగా పాసింగ్ విధానాన్ని మార్కెట్లో కొనసాగిస్తున్నామని, నాణ్యత లేకపోవడంతోనే పాసింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రైతు సంఘం నాయకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతుల వల్ల మార్కెట్ కమిటీ నడుస్తుందని, అలాంటి రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. వేరుశనగ నాణ్యత లేకపోతే కొద్దిగా ధర తగ్గించి కనాలిగాని ఇలా గంటల తరబడి పాసింగ్ విధానాన్ని కొనసాగించడం ఏమిటన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వీరభద్ర గౌడ్, వేరుశనగ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరణప్ప, సహాయ కార్యదర్శి శాంత కుమార్ పాల్గొన్నారు. వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు.

6న సర్పంచుల చలో అసెంబ్లీ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని ఈ నెల 6న సర్పంచుల చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్లు, గ్రామ పంచాయతీలను సర్పంచుల అధీనంలోనే పని చేయించాలని, ఉపాధి హామీ నిధులను సర్పంచుల చేతనే ఖర్చు చేయించాలనే తదితర డిమాండ్లతో అసెంబ్లీని ముట్టడిస్తున్నామన్నారు.

బైక్‌పై నుంచి కాలువలోపడి యువకుడి మృతి

- ఒకే రోజు మూడు ప్రమాదాలు..
- కోసిగి మండలంలో చోటు చేసుకున్న వరుస ఘటనలు

కోసిగి, ఫిబ్రవరి 2: మండలంలోని కోల్‌మాన్ పేట, తిప్పలదొడ్డి గ్రామాల మధ్య ఉన్న ఎల్లెల్సీ కాలువలో బైక్ అదుపు తప్పి కాలువలో పడి కోసిగిలోని 3వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన కలశం రవి (33) అనే యువకుడు మృతి చెందాడు. గురువారం రాత్రి ఆయన భార్య గ్రామమైన చూడీ గ్రామానికి వెళ్తుండగా..ఈ ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం సమీప పొల్లాలోని రైతులు కౌతాళం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య లింగమ్మ, నాలులు నెలల కుమారుడు ఉన్నారు. అట్లాగే దుద్ది చెరువు సమీపంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో బైక్‌లు అదుపు తప్పి కోసిగికి చెందిన నాడిగేని వీరేష్, పెద్దతుమ్మలం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వీరిని కర్నూలు తరలించారు. కోసిగి నుంచి హాల్వీ దాకా దాదాపు 10 కి.మీల రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

కారు- ఇసుక టిప్పర్ ఢీ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారిపై కారు, ఇసుక టిప్పర్ ఢీకొన్నాయి. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎమ్మిగనూరుకు చెందిన శశిధర్ కర్నూలు నుండి ఎమ్మిగనూరుకు కారులో వస్తున్నాడు. ఇతని కారు, ఎమ్మిగనూరు నుండి కర్నూలు వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ కర్నూలు ప్రధాన రహదారిలోని అగ్రిగోల్డ్ ప్లాట్ల సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఏఎస్ఐ బాలనాయక్ తెలిపారు.

పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తాం



వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 2: భారత ఎన్నికల సంఘం సూచించిన తాజా ఆదేశాలను పరిగణలోకి తీసుకొని పెండింగ్ క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరిస్తామని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు నివేదించారు. శుక్రవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ఎన్నికల సన్నద్ధత, ఎలక్టోరల్ రోల్ ఫార్మ్ 6,7,8ల పెండింగ్, పోలింగ్ కేంద్రాల సదుపాయాలు, భద్రత, వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, కౌంటింగ్ సెంటర్లు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా జనవరి 22వ తేదీ ప్రచురణకు ముందు ఫారం 6,7,8కు సంబంధించి 17500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, జనవరి 23 నుంచి ఇప్పటి వరకు 8991 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ ఇంటింటి వెరిఫికేషన్ చేయించి జాబితాలో పొందుపరుస్తామన్నారు. యువ ఓటర్ల నమోదుకు స్పెషల్ కాంపెయిన్ నిర్వహించి నమోదుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపునకు సంబంధించిన నివేదిక ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు పంపి ఆమోదం పొందిన తర్వాతనే జాబితాలో తొలగించాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా.కె శ్రీనివాసులుతోపాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

తుగ్గలి, ఫిబ్రవరి 2: తల్లిని హత్య చేసిన కేసులో నిందితులు లిఖిత్ రెడ్డి, పెద్ద లింగారెడ్డిలను గురువారం అరెస్టు చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన మండల పరిధిలోని రాతన కొత్తురులో పచ్చర్లపల్లి లక్ష్మీదేవిని ఆమె కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి గుంటక మేటుతాడుతో తలపైమోది హత్య చేశారని అన్నారు. ఆ హత్యకేసులో సహ నిందితుడు లింగారెడ్డితో సహ పరారైన లిఖిత్ కుమార్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

నిబంధనలను పాటించండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన ఈఆర్వోలను ఆదేశించారు. శుకవారం కలెక్టర్ ఈఆర్వోలు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఓ హ్యాండ్ బుక్‌ను ఈఆర్‌ఓలు తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సీఎం జగన్ బీసీల ద్రోహి

'జయహో బీసీ' సదస్సులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



గాజులపల్లిలో మాట్లాడుతున్నబుడ్డా రాజశేఖర్‌రెడ్డి



మహానందిలో బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మహానంది, ఫిబ్రవరి 2: సీఎం జగన్ బీసీల ద్రోహి అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని గాజులపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బుడ్డా మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ వైసీపీ అధికారంలోకి వచ్చిందని, అయితే అరాచక పాలనకు ప్రజలు చరమ గీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోకుండా ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాం లోనే మహానంది మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, బీసీ నాయకులు జిల్లెల శ్రీరాములు, బోయ రామకృష్ణ, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాంబాషా, మధు, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, మసీదుపురం మౌళీశ్వరరెడ్డి, కిలార్ వెంకటేశ్వర్లు, నందిపల్లి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మహానందిలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మహానంది గ్రామ ప్రధాన కూడలిలో ఈశ్వర్‌నగర్‌లో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా మహానంది గ్రామ ఇన్‌చార్జిలు సూరే శ్రీనివాసులు, గని చిన్నరంగస్వామి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై మహానందికి చెందిన భూపతి శ్రీనివాసులు, భూపతి రామ చంద్రుడు ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సీహెచ్ రాముడు, కంచెర్ల శివ, మారెడ్డి సుబ్రమణ్యం, నాగరాజు, కాకర్ల శివ, నందిరెడ్డి, రమణగౌడ్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



ఎం.లింగాపురంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతి రేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య సూచించారు. ఎం.లింగాపురంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. జయసూర్య మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుండటంతో అభివృద్ధి కూడా కుంటు పడిందని ఆరోపించారు. అలాగే ఓటరు జాబితాలోని తప్పులను, దొంగ ఓట్లను గుర్తించాలన్నారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సింగరాజుపల్లి స్వామిరెడ్డి, న్యాయవాది నాగముని, రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, మాడుగుల శేఖర్, మారెన్న, నాగేశ్వరరెడ్డి, మాసుమయ్య, చంద్రగౌడు, పరమేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శివారెడ్డి, జహరుల్లా, నాగార్జున, మద్దిలేటి, ధర్మరాజు, పెద్దరాముడు, దాసు, అంజనేయులు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం తప్పదు'



మాట్లాడుతున్న తుళ్ళూరు మహిళా రైతు నాగమల్లేశ్వరి

మహానంది, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రజలకు పట్టిన జగన్ భూతం నుంచి విముక్తి కలిగి త్వరలో మంచి రోజులు వస్తాయని, వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని అమరావతి కోసం భూములు ఇచ్చిన తుళ్ళూరు మహిళా రైతులు అన్నారు. శుక్రవారం మహానంది క్షేత్రానికి దర్శనార్థమై పదిమంది తుళ్ళూరు రైతులు వచ్చారు. అనంతరం మహానంది శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన టీడీపీ సభలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసారు. అనంతరం బృందం సభ్యురాలు నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సీఎం జగన్ అధోగతి పాలు చేసారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఒక్క పరిశ్రమను కూడా రాకుండా చేశారని అన్నారు. టీడీపీ భారీ విజయం సాధించి, సీఎం గా తిరిగి చంద్రబాబు పీఠం అధిరోహిస్తారన్న ధీమాను వ్యక్తం చేశారు.

వేతన సవరణ చేయాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ సహాధ్యక్షుడు చంద్రశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 2: బడ్జెట్ సమావేశాలకు ముందే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రయోజనాలు కల్పించే వేతన సవరణ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సోమేశుల చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్సీ అమల్లో జాప్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ఏడాది జూలై నుంచి నేరుగా ఆర్థిక ప్రయోజనాలు కలిగించే విధంగా 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు పరచాలని డిమాండ్ చేశారు. జూన్‌లో జరిగిన అశాస్త్రీయ బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయానికి గురైన సీనియర్ ఉపాధ్యాయులకు నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్, సుబ్బయ్య, నాగేంద్రకుమార్, శ్రీనివాసరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమన్వయంతో ముందుకు సాగాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 2: అరాచక వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ఎలాంటి విభేధాలు లేకుండా టీడీపీతో కలసి జనసేన కార్యవర్గం పని చేయాలని టీడీపీ, జనసేన పార్టీల శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త రౌత్ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం బండిఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో జనసేన మండ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ చేస్తున్న అన్యాయం, అరాచకంలో అన్ని వర్గాల ప్రజలు పావులేనని, వాటిని ప్రజలతో కలిసి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేనల సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో దొంగ ఓట్లను గుర్తించాలని సూచించారు. అనంతరం నారాయణపురంకు చెందిన వైసీపీ నాయకులు గొడుగు శేఖర్, సుబ్బయ్య, రాజేష్‌తో పాటు మరో 10 మంది కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు శాలుబాషా, దేవరాజు, మల్లికార్జున, స్థానిక నాయకులు వేణుగోపాలాచారి, చాంద్‌బాషా, మల్లేష్ యాదవ్, జయంత్ ఆచారి పాల్గొన్నారు.

మునగ తోటల పరిశీలన



మునగ తోటను పరిశీలిస్తున్న అంబుడ్స్‌మన్ సురేంద్ర

పాములపాడు, ఫిబ్రవరి 2: మండలంలోని రుద్రవరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ జిల్లా అంబుడ్స్‌మన్ సురేంద్ర మునగ తోటలను పరిశీలించారు. శుక్రవారం ఉపాధి హామీ ద్వారా సాగుచేస్తున్న తోటలను పరిశీలించి సలహాలు, సూచనలు తీసుకోవాల్సి జాగ్రత్తలు, తెలియచేశారు. వారానికి మునగ పంటకోతకు పదివేల మేర లాభం వస్తుందని రైతులు తెలిపారు. పంట దిగుబడి పెంచుకోవాడానికి తీసుకోవాల్సిన పద్ధతులను తెలియచేశారు. కార్యక్రమంలో మండల ఏపీవో విమలమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

'లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి'



కోర్టు హాల్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న న్యాయాధికారి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు, ఫిబ్రవరి 2: జాతీయ లోక్ అదాలత్ మార్చి 9వ తేదీన జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆత్మకూరు కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీచేయదగ్గ కేసులను పరిష్కరించేలా చొరవ తీసుకో వాలని సూచించారు. ప్రత్యేకించి క్రిమినల్, చెక్‌బౌన్స్, భార్యభర్తల పంచాయ తీలు, 10లీటర్లలోపు లిక్కర్ కేసులు వంటి వాటిని లోక్ అదా లత్‌లో పరిష్కరింపజేయాలని సూచించారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి శేషసాయి, ఏపీపీ బాబురాజేంద్ర ప్రసాద్, ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు ఎస్ఐలు ఉన్నారు.

'పొగాకులో అధిక దిగుబడికి పరిశోధనలు'



పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 2: పొగాకు పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయని అఖిల భారత పొగాకు పరిశోధనల విభాగం ఐసీఏఆర్ -సీటీఆర్ఐ రాజమండ్రి నోడల్ ఆఫీసర్, సస్యప్రజనన విభాగాధిపతి డాక్టర్ కె.సరళ, సస్య విభాగాధిపతి డాక్టర్ కస్తూరికృష్ణ తెలిపారు. శుక్రవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరుగుతున్న పొగాకు పరిశోధనలను పరిశీలించారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఆర్ఏఆర్ఎస్‌లో పొగాకు విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ పుల్లిబాయి, డాక్టర్ కె.సతీష్‌బాబులు పరిశోధనల ప్రగతిని నోడల్ ఆఫీసర్‌కు వివరించారు. ఏడీఆర్ డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పొగాకు విస్తీర్ణం పెరుగుతోందని తెలిపారు. విస్తీర్ణం పెరుగుదలకు అవసరమైన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో రైతులకు తెలియ జేస్తూ ఉండాలన్నారు. శాస్త్రవేత్తల పరిశోధనలకు అనుగుణంగా పొగాకును సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.సరళ, డాక్టర్ కస్తూరికృష్ణ సూచించారు.

అడవి పందిని చంపిన కేసులో ఇద్దరి అరెస్టు

మహానంది, ఫిబ్రవరి 2: మహానంది మండలం నల్లమలలో అడవి పం దిని చంపిన కేసులో మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వేటగాళ్లు నల్లబోతుల మధు, రుద్రవరం మండలం పందిర్లపల్లి గ్రామానికి చెందిన ఉల్లెడ మల్లేష్‌ను అరెస్ట్ చేశారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి శుక్రవారం వివరాలు తెలిపారు. నల్లమలలో హతమార్చిన అడవి పంది మాంసాన్ని గోపవరం పొలాల్లో వంట చేసుకొంటుండగా గుర్తించి అధికారులు సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించారు. వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు డీఆర్వో తెలిపారు. మెబైల్ పార్టీ డీఆర్వోలు నాగేంద్ర నాయక్, విజయలక్ష్మి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్ ఉన్నారు.

'కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అభిరుచి మధు

గోస్పాడు, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. ఈనెల 9 నుంచి బీజేపీ చేపట్టనున్న పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్టీ కార్యకర్తలతో గోస్పాడులో వర్క్‌షాప్ నిర్వహిం చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లా కోకన్వీనర్ తాడి రామకృష్ణారెడ్డి, మండల ప్రోగ్రాం కన్వీనర్ రామసుబ్బారెడ్డి, నాగేంద్ర బాబు, బీజేపీ మండల కన్వీనర్ మధుగోపాల్, నాయకులు బాలముని, నక్కా నాగేష్, మౌలాలి, పురుషోత్తం, నాగమద్దిలేటి, శీలన్న పాల్గొన్నారు.

● ఎస్.కూలూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు హ నుమంతరెడ్డి (60) గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు, మండల అధ్యక్షుడు మధుగోపాల్ నాయకుడి మృతికి నివాళి అర్పించారు.

పౌష్టికాహారం పంపిణీ

పాములపాడు, ఫిబ్రవరి 2: మండలంలోని క్షయవ్యాధి గ్రస్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసినట్లు టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలోని 23 మందికి ఏఎన్ఎంలు, ఆశావర్కర్ల ద్వార సెంట్రల్ పవర్ గ్రిడ్ సంస్థ వారు అందిం చిన మూడువేల రూపాయలు విలువగల నూనె, రాగిపిండి, శనిగవిత్తనాలు, కందిబ్యాల్లు కల్గిన కిట్లను ఉచితంగా అందచేసినట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నందికొట్కూరు ఫిబ్రవరి 2: నందికొట్కూరు పట్టణంలో తెలంగాణకు చెందిన మదం బాటిళ్లను నందికొట్కూరు పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మల్యాల క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి పోలీసులను చూసి ఆటో దిగి పారిపోతుండగా పట్టుకొని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించారు. ఆ బ్యాగ్‌లో తెలంగాణకు చెందిన 375 ఎంఎల్ బాటిళ్ల లభ్యమయ్యాయి. దీంతో నిందితున్ని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా నిరంజన్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరించిన నిరంజన్‌రెడ్డి

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 2: నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా పి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా వ్యవహరించిన సి.రవిచంద్రారెడ్డిని ఆయన మాతృ శాఖ వర్క్స్ అండ్ అకౌంట్స్ శాఖకు ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీల నేపథ్యంలో పురపాలక శాఖలో వెయిటింగ్ ఫర్ పోస్టింగ్‌లో ఉన్న నిరంజన్‌రెడ్డిని నంద్యాల కమిషనర్‌గా నియమించారు.

'ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి'

నంద్యాల పురపాలక సంఘం పరిధిలో 2024-2025 సంవత్సరానికి వర్తక వాణిజ్య సముదాయలలో ఉన్న దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని కమిషనర్ పి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌ల డిమాండ్లను జనరేట్ చేసినట్లు తెలిపారు. కిరాణం దుకాణాలు, ప్రైవేటు ఆసుపత్రుల సముదాయాలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, బార్‌లు, షాపింగ్ మాల్స్, బేకరీలు, సినిమా హాల్‌లు, తదితర యజమానులంతా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 28వ తేదీలోపు ట్రేడ్ లైసెన్స్ ఫీజును చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని కోరారు. తద్వారా పట్టణ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

ఎంపీడీవోగా నరేష్‌కృష్ణ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న నరేష్‌కృష్ణ

నందికొట్కూరు రూరల్ ఫిబ్రవరి 2: నందికొట్కూరు మండల అభివృద్ధి అధికారిగా నరేష్‌కృష్ణ శుక్రవారం బాధ్య తలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహి స్తున్న ఎంపీడీవో శోభారాణి అనంత పురం జిల్లా బుక్కరాయ సముద్రానికి మదిలీ కావడంతో ఆమె స్థానంలో నరేష్ క్రిష్ణ రావడం జరిగింది. ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా చిలమ త్తూరు మండలం నుంచి నందికొట్కూరు మండలానికి బదిలీ అయినట్లు తెలిపారు. నందికొట్కూరు మండల అభివృద్ధికి చేయూత అందిస్తానన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: డీఎస్పీ



వేంపెంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పాములపాడు, ఫిబ్రవరి 2: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వేంపెంట గ్రామంలో శుక్రవారం రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. శాంతి యుతంగా ఎన్నికలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణం, ఎస్ఐ అశోక్ గ్రామంలోని పాఠశాలలో రాత్రి బస చేశారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీశైలం ఈవో



కలెక్టరుకు దేవస్థానం క్యాలెండర్‌ను అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, ఫిబ్రవరి 2: నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. శ్రీనివాసులును శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులుకు శ్రీశైల మల్లికార్జున స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలు, దేవస్థానం క్యాలండర్‌ను అందజేసి సత్కరించారు.

పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం: ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 2: పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ సంక్షేమ దివస్‌లో ఆయన సిబ్బంది నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేసే పోలీసులతో పాటు హోంగార్డుల సమస్యలపై తక్షణం దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది, హోంగార్డులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ దృష్టికి తెచ్చారు. వారి నుంచి వినతులు స్వీకరించిన ఎస్పీ సమస్యలను సమగ్రంగా తెలుసుకొని సత్వరమే వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు. విధినిర్వహణలో సిబ్బంది ఇబ్బందిపడకుండా వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సమస్యలపై సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సూర్యమౌళి, సీసీ నాగరాజు పాల్గొన్నారు.

'ఉపాధి పనులతో పేదల జీవితాల్లో వెలుగు'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 2: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో హనీఫ్‌ఖాన్, ఏపీవో వసుధ అన్నారు. శుక్రవారం ఉపాధిహామీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఉపాధిహామీ పనులు కూలీలకు, రైతులకు ఎంతగానో ఉపకరించాయన్నారు. ప్రజలు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో నాగార్జున, ఈసీ వరదరాజులు, రామసుబ్బారెడ్డి, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహానందీశ్వరునికి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, ఫిబ్రవరి 2: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరునికి పల్లకీ ఉత్సవాన్ని వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని అలంకార మంట పంలో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై అర్చకులు ఆశీనులు గావించారు. అనం తరం వేదమంత్రాలతో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ మధ్య పలకీ ఉత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ



ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, ఫిబ్రవరి 2: శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి స్వామికి పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులను సమర్పించారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 2: నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీశైలంలో భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 2: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఎమ్మిగనూరుకు చెందిన డి.విమలాక్షమ్మ అనే భక్తురాలు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. వారికి దేవస్థానం అధికారులు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

మహానంది: మహానంది క్షేత్రంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆత్మకూరుకు చెందిన రాజారెడ్డి, శివరామిరెడ్డి రూ. 10,116 విరాళంగా అందచేసినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న తెలిపారు. వీరిని శాలువాతో సన్మానించి, స్వామి ప్రసాదాలు, బాండును అందజేశారు.

6న బహిరంగ వేలం పాటలు

గడివేముల, ఫిబ్రవరి 2: శివరాత్రి సందర్భంగా దుర్గాభోగేశ్వరంలో తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి ఈ నెల 6న బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల పాటు చెరుకు గడలు, పుచ్చకాయ పండ్లు అమ్ముకునేందుకు, సంవత్సర కాల పరిధిలో ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్‌లు విక్రయించుకోవడానికి, సప్లయర్స్ సామాన్‌లు బాడుగ ఇచ్చుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

ఎస్పీని కలిసిన సీఐలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 2: చిత్తూరు జిల్లా పుత్తూరు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా ఆత్మకూరు టౌన్‌కు బదిలీ అయిన కె.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● అనంతపురం జిల్లాలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూల్ రేంజ్‌లో రిపోర్టు చేసుకొని నంద్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన ఇ.కంబగిరి రాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి పూలమొక్కను అందజేశారు.

● గుంటూరు జిల్లాలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాలకు బదిలీపై వచ్చిన పి.నిరంజన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం ఆయన నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా 'ఆపస్' ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

వెలుగోడు, ఫిబ్రవరి 2: వెలుగోడు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆవిర్భావ దినోత్సవాన్ని మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బనాయక్, వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భరతమాత చిత్ర పటానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తూ జాతీయ భావాలు గల విద్యార్థుల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అహోబిలంలో స్వాతి వేడుకలు



దిగువ అహోబిలంలో సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వేదపండితులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువఝామున్నే ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పూలమాలలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పావన, సుదర్శనమూర్తిని ఉంచి సుదర్శనహోమాన్ని వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. స్వాతి వేడుకలను పురష్కరించుకొని భక్తులు నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొని సుదర్శన హోమంలో పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. ఈ వేడుకల్లో టీడీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, మాజీ సర్పంచ్ పాములేటి, బండి రామచంద్రుడు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని దొర్ని, గుట్టకొండ, నరసాపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో శుక్రవారం స్వాతి వేడుకలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామి అమ్మవార్లకు అభిషేకం చేసి వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

బనగానపల్లె: పట్టణంలోని రవ్వల కొండలో వెలసిన చెంచెలక్ష్మి సమేత పావన నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలిశెట్టి పావన నరసింహ మూర్తి ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకాలు, అర్చనాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బూరుగుల శ్రీనివాసులు, ఆల్వకొండ శ్రీనివాసులు, చిన్నతిమ్మారెడ్డి, శారద, సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.



రవ్వల కొండలో..

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

సంజామల, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ నిరుద్యోగులను మోసం చేశారని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో విజయకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేవరాజు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని, 23వేలు టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని మోసం చేశారని విమర్శించారు. 2021లో 18,500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం కేవలం 6,100 ఉపాధ్యాయుల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. నిరుద్యోగులు చిరంజీవి, మధు, విద్యా సాగర్, సురేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించినప్పుడే గుర్తింపు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2: ప్రజలకు ఉత్తమ సేవలందించిన్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో సయ్యదున్నీసా అన్నారు. గురువారం కోవెల కుంట్ల పట్టణంలో తహసీల్దారుగా పనిచేసి బదిలీ అయిన పుష్పకుమారిని తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కోవెలకుంట్ల నుంచి చిత్తూరు జిల్లా కార్వేటి నగర్‌కు తహసీల్దారు పుష్పకుమారి బదిలీ కావడంతో ఆమెను కోవెలకుంట్ల సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ సూర్యనారాయణెడ్డి, వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు నాగమద్దిలేటి, ఎంపీడీవో సయ్యదున్నీసా, టీసీ చంద్రశేఖర్ సత్కరించారు. ఈవో గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి అన్వర్ పాల్గొన్నారు.

'ఉపాధి పనులకు ప్రణాళిక సిద్ధం'

చాగలమర్రి, ఫిబ్రవరి 2: మండలంలో ఈ ఏడాది కొత్తగా రూ.1.25 కోట్లతో పనులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని ఏపీవో నిర్మల తెలిపారు. శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు పనులు గుర్తించామని చెప్పారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభల్లో పనులు తీర్మానించామని అన్నారు. 195 పనులు గుర్తించామని అన్నారు. కూలీలకు 100 రోజులు పనిదినాలు కల్పిస్తామని అన్నారు. పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బేతంచెర్ల, ఫిబ్రవరి 2: పట్టణంలోని బైటిపేటకు చెందిన దూదేకుల కాసీంబీ అనే మహిళను నరేంద్ర రెడ్డి అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడని కేసు నమోదైనట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. గోర్లగుట్ట గ్రామానికి చెందిన నరేంద్ర ఎడ్డి కాసీంబీతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నరేంద్ర రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

అవుకు, ఫిబ్రవరి 2: మండలంలోని గుండ్ల శింగవరం గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి అను వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాలు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్ల శింగవరం గ్రామానికి చెందిన కుమ్మరి మద్దిలేటి స్వామి తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని భూపాల్‌రెడ్డిని అడుగాడన్నారు. భూపాల్‌రెడ్డి వేట కొడవలి తో మద్దిలేటిస్వామిపై కొడవలితో కడుపుపై దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అవుకు ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో కలసి గుండ్ల శింగవరం వద్ద భూపాల్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన సైమూన్ అనే వ్యక్తి అదృశ్యపై కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సైమూన్ పట్టణంలోని సనా డిగ్రీ కాలేజిలో అధ్యాపకుడిగా పనిచేసే వారన్నారు. గత నెల 29వ తేదిన కర్నూలులో ఉద్యోగం కోసం వెళ్తున్నాని చెప్పి ఇంటి వద్ద నుంచి బయలుదేరి వెళ్ళారు. అయితే 30న ఇంటికి తిరిగి రాకపోగా సెల్ స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఆయన భార్య లిఖిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

ఐదు గడ్డివాములు దగ్ధం

రూ.2 లక్షల నష్టం



కాలిపోయిన గడ్డివాములను పరిశీలిస్తున్న రైతులు, నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 2: మండలంలోని పాపసాని కొట్టాల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఐదు గడ్డివాములకు నిప్పంటించడంతో రూ.2లక్షల నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు. పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన ఎద్దుల నరసింహారెడ్డి, పాపసాని ఎల్లనాగిరెడ్డి, పాపసాని ఈశ్వరరెడ్డిలు వీరికి ఐదు గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి నిప్పు పెట్టారు. గడ్డివాములు పూర్తిగా కాలిపోయి రూ.2లక్షల మేర నష్టం వాటిలినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వరర్ రెడ్డిలు అక్కడికి వెళ్లి పరిశీలించారు. సర్పంచ్ బలపాలపల్లి ఎద్దులన్న, ఎంపీటీసీ తిమ్మయ్య ఉన్నారు.

వైసీపీ పాలనలో కులవృత్తులు నిర్వీర్యం

» మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఫిబ్రవరి 2: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని బీసీలు ఆదరణ కోల్పోయారని, కులవృత్తులను నిర్వీర్యం చేశారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. శిరివెళ్లలో శుక్రవారం 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి అఖిలప్రియను బీసీ సంఘం నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలు, కులవృత్తుల వారికి ఆదరణ పథకం ద్వారా విరివిగా లబ్ధి చేకూరిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా వాటినే తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి రాక్షక పాలన సాగిస్తున్న దౌర్భాగ్యం ఏ రాష్ట్రంలో లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో 13 బీసీ భవనాలకు, వెయ్యికి పైగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ నిలిపివేసిందన్నారు. పెళ్లి కానుక, విదేశీ విద్య, కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను రద్దు చేసి ప్రజా సంక్షేమాన్ని విస్మరించిని వైసీపీకి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ టీడీపీ హయాంలో ఆదరణ పథకం కింద బీసీలకు, కులవృత్తుల వారికి పనిముట్లు, ఆర్థిక చేయూత అందించారన్నారు. వైసీపీ అధాకారంలోకి వచ్చాక గతంలో చేపట్టిన పథకాలను రద్దు చేసి బీసీలకు ఏ ఒక్క కొత్త పథకాన్ని అమలు చేయలేదన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి భూషన్న, నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి సల్లా నాగరాజు, బెస్త కార్యవర్గ సభ్యుడు కొండబోయిన బాలచంద్రుడు, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, శీలం లక్ష్మీప్రసాద్, పీపీ లింగమయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: శిరివెళ్లకు చెందిన ముస్లింలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. హబీబ్, ఇర్ఫాన్, రఫి, మదార్‌వలి, జాకీర్ బాషా, ఖాజా ఫరీద్, ఫరూక్, షరీఫ్, సులేమాన్, ఇమ్రాన్, మహమ్మద్, షబ్బీర్ చేరారు. అలాగే సలాదిపేటకు చెందిన వరప్రసాద్, రామకృష్ణ, విష్ణు, శ్రీహరి, నరసింహుడు, సుమంత్, మహేష్, శివ ప్రసాద్, రాము, పుల్లన్న, అనేక్, రామకృష్ణ, మల్లేష్ తదితరులు టీడీపీలో చేరారు. భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడు, కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి, యామా గుర్రప్ప, సూరా రామ, ఉల్లి వెంకట సుబ్బయ్య, బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, సిద్ధిఖ్, పీపీ లింగమయ్య పాల్గొన్నారు.

'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 2: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు అబ్దుల్లా అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 213 బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. నాయకులు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం తథ్య మని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్లా, బషీర్, ఆచారి, సిలార్ సాహేబ్, పెద్దన్న, మహిళలు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2: ఆళ్లగడ్డ తహసీల్దార్ హరినాథరావు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మండల రెవెన్యూ సిబ్బంది తహసీల్దారు శుక్రవారం శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధన



యర్రగుంట్లలో త్యాగరాజ స్వామి చిత్రపటంతో ఊరేగింపు

శిరివెళ్ల, ఫిబ్రవరి 2: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో సద్గురు త్యాగరాజ స్వామి 4వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని సీతారాముల దేవస్థానం నుంచి తాగ్యరాజ స్వామి మండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ వాయిద్యకారులచే నిర్వహించిన నాదస్వర కచేరి ప్రజలను విరివిగా ఆకట్టుకుంది. యర్రగుంట్ల నాయిబ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు ప్రజలకు అల్పాహారం, భోజన వసతి కల్పించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నాయి బ్రాహ్మణ సేవా సంఘాల అధ్యక్షులతో పాటు పలువురు ప్రముఖులు, శ్రీరామ సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు'

రుద్రవరం, ఫిబ్రవరి 2: మండలంలోని ఆలమూరు పశువైద్యశాల పరిధిలో 90 శాతం గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు శుక్రవారం పశువైద్యాధికారి నాగ ప్రసన్న తెలిపారు. పశువైద్యశాల పరిధిలో 8600 పశువులు ఉండగా 7600 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశామని చెప్పారు. గాలికుంటువ్యాధి సాధారణంగా వేసవిలో నల్లజాతి, తెల్లజాతి పశువుల్లో వస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు వేశామన్నారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

గోధుమరి ఎల్లమ్మకు పూజలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 2: పుష్యమాసం పురస్కరించుకుని మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామస్థులు ముచ్చట్ల వాగు సమీపంలో వెలసిన గోధుమరి ఎల్లమ్మకు శనివారం పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి విగ్రహాల రూపంలో ఊరేగింపుగా బయలుదేరి బేతంచెర్ల రహదారిలోని ముచ్చట్ల వాగులో కొలువైన గోధుమరి ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనరసింహ స్వామికి..

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్లకు శుక్రవారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకి చేరుకుంది. మండలం లోని నాగిరెడ్డిపల్లె గ్రామం నుంచి బయలు దేరిన ఉత్సవ పల్లకికి పడకండ్ల గ్రామ ప్రజలు మేళతాళాలతో స్వాగతం పలికారు. గ్రామంలోని తెలుపుల వద్ద ఉత్సవ పల్లకీ విడిది చేయడంతో ప్రజలు పాల్గొని పూజలు చేసి, కానుకలు సమర్పించారు.

సంతాన వేణుగోపాల స్వామికి..

రుద్రవరం: రుద్రవరంలోని సంతాన వేణుగోపాలస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ స్వామి అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



చాగలమర్రిలో వాసవీమాతకు పూజలు చేస్తున్న మహిళలు

కన్యకాపరమేశ్వరికి.. రుద్రవరంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకి సేవ

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆల యంలో శుక్రవారం అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక ఒడి బియ్యం

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి, పట్టాభిరామ ఆలయాల్లో శుక్రవారం అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక ఒడి బియ్యం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలిత పారాయణం చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, ఫిబ్రవరి 2: గ్రామాల్లో రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో రంగసేతాజీ సూచించారు. శుక్రవారం చాగలమర్రి మూడవ ఆర్‌బీకే కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులు ఈక్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. జొన్న సాగు చేసిన రైతుల నుంచి మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, జొన్నలు విక్రయించుకునే రైతులు ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేసుకోవాలన్నారు. అలాగే పెద్దబోదనం గ్రామంలో పంట నమోదును ఏఈవో మంజుల పరిశీలించారు. వీఏఏలు సుబ్బరాయుడు, మల్లేశ్వరి, రైతులు ఉన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం'

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం అధ్యక్షుడు సంజీవరాయుడు అన్నారు. ఆపస్ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం ఆపస్ జెండాను ఎగుర వేశారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుదాకరరావు,ఎస్ తిమ్మారెడ్డి, బుచ్చిబాబు, మల్లికార్జున రాజు, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 2: బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని సీతారామాపురం మెట్ట సమీపంలో మానసికస్థితి సరిగ్గా లేని గుర్తు తెలియని వ్యక్తి (40) రహదారి పక్కన మృతి చెందాడు. రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు బేతంచెర్ల పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని మృతదేహంగా పోలీసులు నిర్ధారణ చేసి ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు సమాచారం తెలియజేశారు. వన్నూరు బాషా ఆధ్వర్యంలో బృందంతో కలిసి బేతంచెర్ల శ్మశానంలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమం సేవా సంస్థ సభ్యులు లక్ష్మిరాఘవ, యూసుఫ్, నాగేశ్వరరెడ్డి, అక్బర్, సద్దాం, మాబాషా పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

డోన్(రూరల్), ఫిబ్రవరి 2: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డోన్ రూరల్ సీఐ అస్రత్ బాషా అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూలిన సైడ్ వాల్



తెలుగుగంగ ప్రధాన కాలువలో కూలిన సైడ్ వాల్

రుద్రవరం, ఫిబ్రవరి 2: తెలుగుగంగ ప్రధాన కాలువలో 22వ గంగ బ్లాక్ చానెల్ ఎదురుగా సైడ్ వాల్ కూలింది. ప్రధాన కాలువ గోడ కూలిపోయి కాల్వలో రాళ్లన్నీ పడ్డాయి. ఈ సైడ్ వాల్‌లకు ఈ వేసవిలో అయినా గంగ అధికారులు మరమ్మతులు చేయించాలని రైతులు కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల సమస్య



ప్యాపిలి ఆర్టీసీ బస్టాండ్

ప్యాపిలి, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. మరుగుదొడ్ల మురుగును బస్టాండు ప్రాంతంలోని డ్రైనేజీకి మళ్లించడంతో ఆ ప్రాంతవాసులు దుర్వాసన వస్తుందంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గత నెల రోజులుగా మరుగుదొడ్లను అధికారులు బంద్ చేశారు. దీంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అప్రెంటిస్‌షిప్ పునరుద్ధరణ సరికాదు: ఎస్టీయూ



మాట్లాడుతున్న మస్తాన్‌వలి

చాగలమర్రి, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వం ప్రస్తుత డీఎస్సీలో అప్రెంటిస్‌షిప్ పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ శివశంకర్, మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. శుక్రవారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గతంలో అప్రెంటిస్‌షిప్ విధానం అమలు చేసేవారని, అయితే పోరాటాల వల్ల ఆ విధానాన్ని రద్దు చేశారని గుర్తుచేశారు. అయితే మళ్లీ వైసీపీ ప్రభుత్వం అప్రెంటిస్‌షిప్‌ను తెరపైకి తేవడం తగదని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ప్రసాదు, శ్రీనివాసులు, సుబ్బారావు, మాబుహుసేన్, నరసింహులు, నారాయణరెడ్డి, శేషాద్రి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

'ప్రణాళికలు సిద్ధం చేయాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 2: మండలంలోని 21 పంచాయతీల్లో జీపీడీపీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ శుక్రవారం తెలిపారు. ఈ ప్రణాళికలు పంచాయతీలో చేయాల్సిన అబివృద్ధి పనులకు సంబంధించి వాటిని గుర్తించి ప్రణాళికలో పొందుపరిచి ఆన్‌లైన్ చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలో ఉన్న పంచాయతీ హెడ్‌క్వార్టరుతో పాటు బజారా గ్రామాల్లో ఏఏ పనులు చేయాలో గుర్తించి వాటిని ప్రణాళికలో పొందుపరచాలని ఈవోపీఆర్డీ సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 2: చాగలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లా పరిశీలించారు. వారు మాట్లాడుతూ నాణ్యతగల భోజనం తయారు చేయాలని, మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. అనంతరం 10 విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

అటకెక్కిన రింగ్ రోడ్డు నిర్మాణ పనులు

» పెరిగిన ట్రాఫిక్.. ఇబ్బందుల్లో ప్రజలు

బనగానపల్లె, ఫిబ్రవరి 2: బనగానపల్లెలో రింగ్ రోడ్డు నిర్మాణం పనులు అటకెక్కాయి. చాలా ఏళ్లనుంచి రింగ్ రోడ్డు నిర్మాణం కోసం బనగానపల్లె పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు ఎదురు చూస్తున్నారు. బనగానపల్లెలో రింగ్ రోడ్డు లేకపోవడంతో బనగానపల్లె పట్టణంలో రోజు రోజుకూ ట్రాఫిక్‌కు పెరిగిపోతోంది. భారీ వాహనాలు బనగానపల్లె మీదుగా వెళ్తుండంతో నిత్యం బనగానపల్లె పట్టణంలోని సుంకులమ్మ గుడి, పెట్రోల్ బంకు కూడలి, జీఎం టాకీస్, కొత్త బస్టాండ్, పొట్టి శ్రీరాముల కూడలిలో నిత్యం వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పట్టణంలో అనేకసార్లు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. బనగానపల్లె సమీపంలోని యనకండ్ల వద్ద నిర్మించిన సిమెంట్ ఫ్యాక్టరీ, కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కో సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ప్యాపిలి మండలంలోని బూరుగుల సమీపంలో నిర్మించిన ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ భారీ ఫ్యాక్టరీలకు అవసరమైన బొగ్గు, సుద్ద, సిమెంట్‌ను, యాష్ మొదలైనవాటిని 16, 20 టైర్ల వాహనాల్లో బనగానపల్లె మీదుగా వివిధ ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. అలాగే ఫ్యాక్టరీల్లో తయారైన సిమెంట్‌ను హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగుళూరు తదితర నగరాలతో పాటు ఏపీ, తెలంగాణ తదితర రాష్ట్రాలలోని సిమెంట్ వ్యాపార డిస్ట్రిబ్యూటర్లకు తరలిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో గత టీడీపీ ప్రభుత్వ హయంలో రూ.50 కోట్ల వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రింగ్‌రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. కానీ అంతలో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో రింగ్ రోడ్డు పనులు నిలిచిపోయాయి.

రింగ్ రోడ్డు కోసం పొలాల గుర్తింపు: బనగానపల్లె పట్టణ శివారు ప్రాంతాల్లో రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రైతుల పొలాలను ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు గుర్తించారు. రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం 13.5 కిలోమీటర్ల మేర రైతుల పంట పొలాలను సర్వే చేశారు. బనగానపల్లెనుంచి అవుకు సమీపంలోని ఎస్సార్బీసీ కాలనీ సమీపం నుంచి తమ్మడపల్లె, బనగానపల్లె నుంచి కోవెలకుంట్ల రహదారిలోని ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్ మీదుగా, మిట్టపల్లె, కర్నూలు రహదారిలోని బత్తులూరు, బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ మీదుగా తిరిగి అవుకు రహదారిలోని సాయిబాబా ఆలయం వరకు రింగ్ రోడ్డు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

400 మంది రైతుల గుర్తింపు: రింగ్‌రోడ్డు నిర్మాణానికి 400 మంది రైతులకు సంబంధించిన 75 ఎకరాలు పంట పొలాలు రింగ్‌రోడ్డు కోసం కేటాయించేలా ప్రణాళికలు అధికారులు సిద్ధం చేశారు. గత మూడేళ్ల నుంచి అధికారులు రైతులతో సమావేశమవుతున్నారు. అయితే సగం మంది రైతులకే నష్టపరిహారం చెల్లించారు. కొందరు రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. ఎలాగోలా తంటాలు పడి అధిక మొత్తం చెల్లించేలా రైతులను అధికారులను ఒప్పించి భూసేకరణ పనులు పూర్తి చేశారు.

రైతులకు అందని నష్టపరిహారం: రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూమిలో 200 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించారు. ఇంకా 200 మంది రైతులకు నష్ట పరిహారం అందలేదు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. తమ అకౌంట్లలో డబ్బు పడితే కాని తమ పొలాల్లో రింగ్ రోడ్డు పనులు చేసేందుకు అంగీకరిస్తామని రైతులు తెగేసి చెప్పారు. దీంతో రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో రింగ్ రోడ్డు పనులు కొలిక్కి రాలేదు.

అటకెక్కిన రింగ్ రోడ్డు నిర్మాణం పనులు: రింగ్ రోడ్డు వస్తే బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ముఖ్యంగా బస్టాండ్ నుంచి పెట్రోల్ బంకు, అవుకు మెట్ట, పొట్టి శ్రీరాముల కూడలి, జీఎం టాకీస్‌ల వద్ద భారీ వాహనాల వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రింగ్ రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య బనగానపల్లె పట్టణంలో పూర్తిగా తీరనుంది.

రైతులకు నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదించాం

రైతులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సగం మంది రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉంది. రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాలోకి జమ చేస్తాం.

- కోవెలకుంట్ల సబ్ డివిజన్ ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి



బనగానపల్లెలో రింగ్ రోడ్డు కోసం సేకరించిన భూమి